ప్రభుత్వ చీఫ్‌ విప్‌ రాంచంద్రనాయక్‌కు ఆహ్వానం

కాచిగూడ: శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి హైదరాబాద్‌ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన కురవి శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంది. ఈ వేడుకకు హాజరు కావాలని సేవా సమితి ప్రధానకార్యదర్శి కాలను వినోద్‌, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కాసుల మల్లికార్జున్‌ శుక్రవారం ప్రభుత్వ చీఫ్‌ విప్‌ రామచంద్రనాయక్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు.

ప్రమాణాలు పాటించని కాలేజీలపై చర్యలు తీసుకోండి

ఉస్మానియా యూనివర్సిటీ: జేఎన్‌టీయూ పరిధిలోని ప్రైవేటు ఇంజినీరింగ్‌ కాలేజీలలో ప్రమాణాలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వీసీ ప్రొ.కిషన్‌కుమార్‌ రెడ్డికి శనివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ వినతిపత్రం సమర్పించారు. కాలేజీలు నిబంధనలను ఉల్లంఘిస్తు ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నాయని తెలిపారు. అధ్యాపకులు, ల్యాబుల కొరత, ఇతర మౌలిక వసతులు లేకున్నా ఇంజినీరింగ్‌ కాలేజీలను కొనసాగిస్తున్నట్లు వీసీకి వివరించినట్లు చెప్పారు.

బిల్లు కట్టకపోతే కరెంట్‌ కట్‌



ముషీరాబాద్‌లో విద్యుత్‌ కనెక్షన్‌ కట్‌ చేస్తున్న విద్యుత్‌ సిబ్బంది

ముషీరాబాద్‌: సకాలంలో విద్యుత్‌ బిల్లులు చెల్లించని వారి ఇంటికి విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్‌ శాఖ ఏడీఈ వినోద్‌కుమార్‌ హెచ్చరించారు. శనివారం పెండింగ్‌ బిల్లుల వసూలు కోసం రాంనగర్‌ ప్రాంతంలో ఆయన స్పెషల్‌ డ్రైవ్‌ చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. ఆజామాబాద్‌ సెక్షన్‌ పరిధిలో రూ.కోటికి పైగా మొండి బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. వినియోగదారులు బాధ్యతతో బిల్లులు చెల్లించి విద్యుత్‌ శాఖకు సహకరించాలని కోరారు.

పీహెచ్‌డీ విద్యార్థుల ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ రిజిస్ట్రార్‌ ఛాంబర్‌లో పీహెచ్‌డీ విద్యార్థులు ధర్నా చేపట్టారు. శనివారం 2018 ఆగస్టు నుంచి 2019 వరకు రెండు విడతలుగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన విద్యార్థులు పరిశోధనను పూర్తి చేసేందుకు కాలపరిమితిని ఒక సంవత్సరం పాటు పొడిగించాలని డిమాండ్‌ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ నెల 28న జరిగే స్టాండింగ్‌ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు. కొమ్ము శేఖర్‌మాదిగ, జీడీ అనిల్‌కుమార్‌, జంగిలి దర్శన్‌, పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

లిబర్టీ: అన్ని వర్గాల విద్యార్థులు ఒకే ప్రాంగణంలో విద్యాభ్యాసం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌ స్కూల్స్‌ ఏర్పాటు చేయడం మంచి పరిణామం అని మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 105 ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌ స్కూల్స్‌ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు.

మానవ సంబంధాల విశిష్టత పిల్లలకు నేర్పించాలి


మలక్‌పేట: మానవ సంబంధ బాంధవ్యాల విలువ పిల్లలకు నేర్పించాల్సిన ఆవశ్యకత ఉందని శ్రీ చైతన్య స్కూల్‌ దిల్‌సుఖ్‌నగర్‌ జోన్‌ ఏజీఎం సతీష్‌ అన్నారు. మూసారంబాగ్‌ బ్రాంచీలో శనివారం స్మార్ట్‌ లీవింగ్‌ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యామిలీ బ్లూమ్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి ఫ్యామిలీ ప్రోగ్రాం చేపట్టడంతో పిల్లలకు పెద్దలు, తల్లిదండ్రుల పట్ల ప్రేమ, ఆప్యాయత, గౌరవ మర్యాదలు పెరుగుతాయన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పాద పూజ చేసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌వి వెంకట్‌ రెడ్డి, ప్రిన్సిపాల్‌ రిజ్వాన్‌, డీన్‌ శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా వర్గీకరణ చేయాలి

పంజగుట్ట: సామాజిక వెనుకబాటు ఆధారంగానే ఎస్సీ వర్గీకరణ చేయాలని సామాజిక న్యాయ సాధన వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్‌ ఎస్‌.ఆర్‌.వేమన అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెనుకబాటు తనం ఆధారిత ఎంపిక ప్రక్రియ తీరును చార్ట్‌ రూపంలో డాక్టర్‌ పట్టా వెంకటేశ్వర్లు, పెరియార్‌ అంబేద్కర్‌, బడుగు భాస్కర్‌ జోగేష్‌, భూపతిరావు, కాగిత రమేష్‌ బాబుతో కలిసి వివరించారు. మందకృష్ణ మాదిగ సూచించినట్లు జనాభా ఆధారంగా రిజర్వేషన్‌ ఫలాలు ఇస్తే తిరిగి ఇప్పటివరకు రిజర్వేషన్‌ ఫలాలు పొందిన వారే తిరిగి ఫలాలు పొందుతారన్నారు.

దోమల స్వైరవిహారం.!

- దోమల నివారణలో అధికార యంత్రాంగం విఫలం
- జనాలకు కంటి మీద కునుకు లేకుండాపోతున్న వైనం
- మూసీ పరిసరాల్లో అయితే దండయాత్ర చేస్తున్న దోమలు
- ఆస్పత్రుల పాలవుతున్న మూసీ పరీవాహక ప్రాంతవాసులు



గోల్నాక గంగనగర్‌లో సాయంత్రం ఓ వ్యక్తి కాలు కాసేపు కదపకుండా ఉంటే వచ్చి చేరిన దోమల గుంపు

అంబర్‌పేట: మూసీ పరీవాహక ప్రాంతాల్లో దోమల బెడదతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండాపోతోంది. చీకటి పడగానే దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధానంగా మూసీ పరీవాహక ప్రాంతాలైన కృష్ణనగర్‌, తులసీనగర్‌, లంక బస్తీల్లో, దుర్గానగర్‌, న్యూ దుర్గానగర్‌ ప్రాంతాల్లో దోమల బెడదతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇలానే మోయిన్‌ చెరువు నాలా పరిసరాలైన మల్లికార్జుననగర్‌, రాహత్‌నగర్‌, బాపునగర్‌, చెన్నారెడ్డినగర్‌, ప్రేమ్‌నగర్‌, అహ్మద్‌నగర్‌ తదితర ప్రాంతాలలో దోమల సమస్య తీవ్రంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దోమల సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఫాగింగ్‌, యాంటీలార్వ సిబ్బంది సర్వేలో ఉండటంతో...

నియోజకవర్గంలో ఉన్న ఐదు డివిజన్లలో డివిజన్‌కు ఒకటి చొప్పున ఫాగింగ్‌ బృందం ఉంది. వీరితో పాటు దోమల లార్వా నిర్మూలించేందుకు ఉదయం పూట నీటి సంపులు, నీటి నిల్వ ప్రాంతాలలో ముందు చల్లే బృందాలు సహితం ఉన్నాయి. ఈ సిబ్బంది ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రేషన్‌కార్డుల సర్వేలకు వెళ్లడంతో ఫాగింగ్‌, యాంటీలార్వా మందు చల్లడం లేదు. దీంతో దోమల బెడద రోజురోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం దోమల బెడద తీవ్ర రూపం దాల్చింది. అధికార యంత్రాంగం సహితం ప్రణాళిక లేకుండా దోమల నివారణ చర్యలు చేపట్టడంతో ఫలితం దక్కడంలేదు.రోజుకో ప్రాంతంలో ఫాగింగ్‌ చేస్తుండటంతో వచ్చే గ్యాప్‌లో దోమలు తిరిగి విజృంభిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు దోమల నివారణపై పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోగాల బారిన పడుతున్న ప్రజలు..

దోమల స్వైర విహారంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల్లో చేరుతున్నారు. వారం రోజులుగా ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగిపోయింది. అంబర్‌పేట నియోజకవర్గంలో పలు బస్తీల్లో దోమల సమస్య తీవ్రంగా నెలకొంది. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

మహా శివరాత్రిని ఘనంగా నిర్వహిస్తాం



వివరాలు వెల్లడిస్తున్న ఆలయ ఈవో జయంతి

నల్లకుంట: మహా శివరాత్రి పర్వదినాన్ని న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి దేవాలయంలో ఘనంగా నిర్వహిస్తామని ఈవో జయంతి తెలిపారు. శనివారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌ జమలాపురం గోపాల్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులతో కలిసి ఆమె శివరాత్రి వేడుకల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ.. ఈనెల 26న జరిగే శివరాత్రికి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నామని చెప్పారు. శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏకవార రుద్రాభిషేకం ఉంటుందన్నారు. అదే విధంగా రాత్రి 12గంటలకు అన్నాభిషేకం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ అర్చకులు నాగేంద్ర శర్మ, అప్పారావు, జ్ఞానేశ్వర్‌, సీతా రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

అంబర్‌పేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఉందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆకాంక్షించారు. శనివారం అంబర్‌పేట మున్సిపాల్‌ గ్రౌండ్‌లో గోల్నాక కేంబ్రిడ్జ్‌ స్కూల్‌ స్పోర్ట్స్‌ డే ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వీహెచ్‌ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టారని ఆయన వెల్లడించారు. క్రీడరంగంలో సహితం యువతకు మంచి భవిష్యత్‌ ఉందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతికి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఆర్‌. లక్ష్మణ్‌యాదవ్‌, ఖైరతాబాద్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్‌, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్‌, నాయకులు శ్రీమంత్‌ గిరి, స్కూల్‌ కరస్పాండెంట్‌ మహ్మద్‌ యాసిన్‌ షరీఫ్‌, ప్రిన్సిపాల్‌ సయ్యాద్‌ అబ్దుల్లా ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మన్మోహన్‌సింగ్‌ వేషధారణలో ఉన్న విద్యార్థిని అభినందిస్తున్న మాజీ ఎంపీ వీహెచ్‌

మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు కృషి



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఐజీ అరోమా సింగ్‌, డీఎస్‌సీ దెబస్మిత తదితరులు

అడ్డగుట్ట: మానవ అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు ఆర్పీఎఫ్‌, జీఆర్పీ, అసోసియేషన్‌ ఆఫ్‌ వాలంటరీ యాక్షన్‌(ఏవీఏ) సంయుక్తంగా కృషి చేస్తున్నాయని ఆర్పీఎఫ్‌ ఐజీ అరోమా సింగ్‌ ఠాకూర్‌, సీనియర్‌ డీఎస్‌సీ దెబస్మిత బెనర్జీలు అన్నారు. శనివారం సికింద్రాబాద్‌ సంచాలన్‌ భవన్‌లోని హవా మహల్‌లో యాంటీ హ్యూమన్‌ ట్రాఫికింగ్‌పై వర్క్‌షాప్‌ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఐజీ అరోమా సింగ్‌ ఠాకూర్‌, డీఎస్‌సీ దెబస్మిత బెనర్జీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువు చెప్పిస్తాం, ఉద్యోగం చూపిస్తామనే మాయమాటలతో పిల్లలు, మహిళలను అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. 2023లో 305 మంది పిల్లలను రెస్క్యూ చేసి 137 మంది ట్రాఫికర్లను అరెస్ట్‌ చేశామన్నారు. అదే విధంగా 2024లో 310 మంది బాధితులను రెస్క్యూ చేసి 174 మంది ట్రాఫికర్లను అరెస్ట్‌ చేసినట్లు వివరించారు. అనంతరం, యాంటీ హ్యూమన్‌ ట్రాఫికింగ్‌ యూనిట్‌ విధి విధానాలకు సంబంధించి బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏవీఏ స్టేట్‌ కోఆర్డినేటర్‌ వెంకటేశ్వర్లు, హర్షిత, ఆర్పీఎఫ్‌, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో వ్యవహరించాలి



లష్కర్‌ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్‌కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేసిన చిరు వ్యాపారులు

పద్మారావునగర్‌: చిరు వ్యాపారుల పట్ల అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని లష్కర్‌ జిల్లా సాధన సమితి అధ్యక్షులు జి. పవన్‌కుమార్‌ విజ్ఞప్తి చేశారు. గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఫుట్‌పాత్‌ వ్యాపార కార్యకలాపాలను అధికారులు తొలగించారు. దీంతో చిరు వ్యాపారులు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు జి. పవన్‌కుమార్‌ గౌడ్‌ శనివారం ఈ ప్రాంతాన్ని సందర్శించి చిరు వ్యాపారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జి. పవన్‌కుమార్‌ గౌడ్‌ మాట్లాడుతూ పొట్టకూటీ కోసం చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకునే వారి పట్ల పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు కొంత సడలింపు ఇవ్వాలన్నారు కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఎస్‌.ఐ కరుణాకర్‌, బీఆర్‌ఎస్‌ బన్సీలాల్‌పేట్‌ అధ్యక్షులు వెంకటేషన్‌రాజు పాల్గొన్నారు.

పరామర్శ



సత్యంను పరామర్శిస్తున్న ఎంపీ డా. కె.లక్ష్మణ్‌

చిక్కడపల్లి: పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసే కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంటుందని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్‌ కె.లక్ష్మణ్‌ అన్నారు. శనివారం బీజేపీ గాంధీనగర్‌ డివిజన్‌ యువ నాయకుడు దోనేటి సత్యం ఇటీవలే అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని జవహర్‌నగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. సత్యం త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్‌ నాయకులు చెర్ల గోపాల్‌రెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్‌, సికింద్రాబాద్‌ పార్లమెంట్‌ జాయింట్‌ కన్వీనర్‌ వినయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

కాచిగూడ: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ చంద్రకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం... దోమలగూడ ప్రాంతానికి చెందిన రమేష్‌ (19) సీసీ కెమెరా టెక్నీషియన్‌. శనివారం సాయంత్రం కాచిగూడ చెప్పల్‌బజార్‌లో ఓ ఇంట్లో సీసీ కెమెరాలను ఫిట్‌ చేసేందుకు వచ్చారు. బిల్డింగ్‌లో సీసీ కెమెరాలను ఫిట్‌ చేస్తుండగా విద్యుత్‌ వైర్లు తగిలి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

కాచిగూడ: ఓ యువతి అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వీరన్నగుట్ట ప్రాంతానికి చెందిన భానుశ్రీ (23) మెడికల్‌ దుకాణానికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన యువతి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హనుమాన్‌నగర్‌ ప్రధాన కార్యదర్శి శ్యామ్‌ మృతి



నల్లకుంట: నల్లకుంట డివిజన్‌ గోల్నాక హనుమాన్‌ బస్తీ బస్తీ ప్రధాన కార్యదర్శి, బీఆర్‌ఎస్‌ నాయకుడు కె. శ్యామ్‌(59) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు ప్రియ శిష్యుడైన శ్యామ్‌ వైఎస్సార్‌ హయాంలో కాంగ్రెస్‌ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇటీవల ఆయన తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. శ్యామ్‌ మరణ వార్త తెలుసుకున్న కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌, బీజేపీ నాయకులు గరిగంటి రమేష్‌, దూసరి శ్రీనివాస్‌గౌడ్‌, కేజే. బాబు తదితరులు మృతుడి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆదివారం ఉదయం 11గంటలకు కాచిగూడ హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించినున్నట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే ముఠాగోపాల్‌

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ అన్నారు. శనివారం శ్రీరాంనగర్‌ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో రూపుల వసంత దయానంద్‌ మెమోరియల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో మెడికేర్‌ రామంతాపూర్‌ సహకారంతో కంటి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ మాట్లాడుతూ... ట్రస్టుల పేరుతో పేదల ఆరోగ్యాలను కాపాడడానికి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఆదర్శనీయమని అన్నారు. ఇలాంటి వారికి ఎల్లప్పుడు తమ వంతు సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు. 20మందికి ఉచితంగా కంటి ఆపరేషన్‌ చేయడానికి సిద్ధంగా ఉన్నామని మెడికేర్‌ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ చైర్మన్‌ రూపుల రాజశ్రీ వివేక్‌, మెడికేర్‌ హాస్పటల్‌ ప్రతినిధులు జి.ప్రశాంత్‌కుమార్‌, ప్రసన్నకుమార్‌, పవన్‌, శ్రీరాంనగర్‌ బస్తీ చైర్మన్‌ ఎన్‌.రాములు, అధ్యక్షుడు హరినాథ్‌, ప్రధాన కార్యదర్శి గంగాధర్‌, కోశాధికారి రవి, గోపి, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంనగర్‌బస్తీలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్‌

వర్గీకరణను జాతీయ ఎస్సీ కమిషన్‌ అడ్డుకోవాలి

కాచిగూడ: తెలంగాణలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను జాతీయ ఎస్సీ కమిషన్‌ అడ్డుకోవాలని, వర్గీకరణతో నేతకాని, మహర్‌ కులాలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర నేతకాని, మహర్‌ కుల సంఘం అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్‌ విజ్ఞప్తి చేశారు. శనివారం నారాయణగూడలోని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జాతీయ ఎస్సీ కమిషన్‌ చైర్మన్‌ (న్యూఢిల్లీ)కు వినతి పత్రం పంపించినట్లు తెలిపారు. మాల మహానాడు జాతీయ గౌరవ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్‌ మాట్లాడుతూ.. ఆర్టికల్‌ 338 క్లాస్‌–9 ప్రకారం జాతీయ ఎస్సీ కమిషన్‌ను సంప్రదించకుండా తెలంగాణలో వర్గీకరణ పేరుతో ఓటు బ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్‌ ప్రభుత్వం పాల్పడుతోందని ఆరోపించారు. కనీసం రాజ్యాంగం నిబంధనలు పాటించకుండా అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తోందన్నారు. దీనిపైన జాతీయ ఎస్సీ కమిషన్‌ స్పందించి వర్గీకరణను అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నేతలు జీఎస్‌ రావు, మద్దెల ప్రవీణ్‌ కుమార్‌, చిప్పరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ నియంత్రణకు కృషిచేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సమాజాన్ని భయపెడుతున్న సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ను పూర్తిగా నియంత్రించేందుకు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్యకు ఎన్విరాన్‌మెంట్‌ ప్రొటక్షన్‌ డెవలప్‌మెంట్‌ కౌన్సిల్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌సీహెచ్‌ రంగయ్య శనివారం వినతి పత్రం సమర్పించారు. పర్యావరణ సమతుల్యత రోజురోజుకు దిగజారిపోతోందని వాపోయారు. ప్రకృతిని కాపాడాల్సిన వ్యక్తులు ప్రకృతి నాశనాన్ని కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ నియంత్రించేందుకు రాజ్యసభలో గళం విప్పాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా ఆర్‌. కృష్ణయ్యకు వినతి పత్రం సమర్పించారు.



ఆర్‌.కృష్ణయ్యకు వినతి పత్రం సమర్పిస్తున్న రంగయ్య

నీటిఎద్దడి నివారణపై ముందుస్తు జాగ్రత్తలు తీసుకోండి



జలమండలి అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌

అంబర్‌పేట: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ జలమండలి అధికారులకు సూచించారు. శనివారం గోల్నాకలోని క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో జలమండలి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై ఆయన సమీక్షించారు. పెండింగ్‌ పనుల్లో జాప్యం నివారించాలని ఆయన సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టే అభివృద్ధి పనులపై అంచనాలు రూపొందిస్తే వాటి ఆమోదానికి తనవంతు కృషి చేస్తానన్నారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణపై ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించండి

కాచిగూడ: ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్‌, తెలంగాణ ఆటో వర్కర్స్‌ యూనియన్‌ అధ్యక్షుడు ఎస్‌.నరసింహారెడ్డి, కార్యదర్శి గోదా మల్లేష్‌, దయానంద్‌ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో వారు మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ జి.సంజీవరెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలపై మంత్రిని కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్‌ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

బీసీ కాలేజీ హాస్టళ్ల పెండింగ్‌ బిల్లులు చెల్లించాలి

ముషీరాబాద్‌: బీసీ కాలేజీ హాస్టళ్ల పెండింగ్‌ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య కోరారు. శనివారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్కమార్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఐదు నెలలుగా బీసీ హాస్టళ్ల మెస్‌ బిల్లులు, మూడేళ్ల నుంచి అద్దె భవనాల బిల్లులు, కరెంటు బిల్లులు చెల్లించలేదన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హాస్టళ్ల సరఫరా అయ్యే నిత్యావసరాల బిల్లులు ఐదు నెలలుగా చెల్లించడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో హాస్టళ్లను మూసేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో దాదాపు బీసీ కాలేజీ హాస్టళ్లు అద్దె భవనాల్లో ఉన్నాయని తెలిపారు. వాటికి ఏడాదిగా అద్దె చెల్లించడం లేదని పేర్కొన్నారు. హాస్టళ్లలో కరెంటు బిల్లులు సైతం ఏడాదిగా పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. బీసీ హాస్టళ్ల పరిస్థితి ఇలా ఉంటే విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఉపముఖ్యమంత్రి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు



పెండింగ్‌ బిల్లులు చెల్లించాలని ఉపముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌.కృష్ణయ్య

కాచిగూడ ట్రాఫిక్‌ పీఎస్‌లో అడిషనల్‌ సీపీ తనిఖీలు

కాచిగూడ: వార్షిక తనిఖీల్లో భాగంగా హైదరాబాద్‌ అడిషనల్‌ సీపీ (ట్రాఫిక్‌) విశ్వప్రసాద్‌ శుక్రవారం రాత్రి కాచిగూడ పోలీస్‌ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ మేనేజ్‌మెంట్‌ ఎలా చేయాలో పలు సూచనలు చేశారు. ట్రాఫిక్‌ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. క్రమశిక్షణ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ సంపత్‌ కుమార్‌, కాచిగూడ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌, ఎస్సైలు శ్రీకాంత్‌, గఫార్‌, ఏఎస్‌ఐలు అనిల్‌గౌడ్‌, విజయకుమార్‌ పాల్గొన్నారు.



కాచిగూడ ట్రాఫిక్‌ పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న హైదరాబాద్‌ అడిషనల్‌ సీపీ విశ్వప్రసాద్‌